

# సినిమాకి వెళ్తే రిక్షా ఎక్కం

**మా** ఇంట్లో ఉన్నవాళ్ళం కాక వచ్చేపోయేవాళ్ళు కూడా చాలామందే ఉన్నారు. వైద్యం కోసం వచ్చే వాళ్ళు, కోర్టు పనిమీద వచ్చేవాళ్ళు, వాళ్ళింట్లో ఏదైనా శుభకార్యం అయితే బట్టలూ బంగారం కొనేందుకు ఇలా చాలామంది చాలా రకాల పనులమీద వచ్చేవాళ్ళు. మా తాతయ్యగారికి దూరపుబంధువులు ముగ్గురుండేవాళ్ళు. వాళ్ళ పేర్లేవిటో గానీ– మేము పెద్ద బామ్మా, చిన్ని బామ్మా, బుజ్జి బామ్మా అనేవాళ్ళం.

వాళ్ళ ముగ్గురికీ పాపం చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తించిందిట. ఆస్తి పాస్తులు బాగానే ఉన్నాయి పల్లెటూళ్ళో. అక్కడ ఉండీఉండీ విసుగెత్తి ఏ ఆర్నెల్లకో మా ఇంటికి వచ్చేవాళ్ళు. వారం రోజులుండి సినిమాలు చూసి వెళ్ళేవాళ్ళు.

బంధువులు రావడం, వాళ్ళని సినిమాకి తీసుకెళ్ళడం మాకు కొత్తేమీ కాదు. మా పిల్లలకి టికెట్లుండవు. మరీ రద్దీగా ఉన్న మొదటి రెండుమూడు వారాలూ టిక్కెట్టు కొనమని అనేవాళ్ళుగానీ ఆ తర్వాత పెద్దవాళ్ళు టిక్కెట్లు కొనుక్కుంటే చాలు – మమ్మల్ని ఫ్రీగా పోనిచ్చేవాళ్ళు. ఆ విధంగా ఒక్కో సినిమా లెక్కలేనన్నిసార్లు చూసేవాళ్ళం మేము.

పాటలూ మాటలూ కూడా కంఠస్థం వచ్చేసేవి మాకు. అలా వచ్చేశాక మళ్ళీ సినిమాకి వెళ్ళాలంటే విసుగేసేది. కానీ ఏం చేస్తాం? మాకు డ్యూటీ పడితే చచ్చినట్లు పెద్దవాళ్ళని వెంటబెట్టుకు తీసుకువెళ్ళాల్సిందే మరి.

ఏదో చెప్పిన పని చెయ్యాలంటే విసుగే కానీ నిజానికి అదేమంత కష్టమైన పని కాదు. సాధారణంగా మేట్నీలకు వెళ్తారు. టిక్కెట్లు, పిప్పరమెంటు బిళ్ళలు కొనిపించి, వాళ్ళను తీసికెళ్ళి హాల్లో కూర్చోబెడితే వాళ్ళ దోవన వాళ్ళు సినిమా చూస్తారు. మనం పిప్పరమెంట్లు తీసుకొని, కావాలనుకుంటే సినిమా చూడొచ్చు. లేదంటే ఇంటికొచ్చి ఇంటర్వెల్ టైముకి వెళ్ళి ఒక సోడాకొట్టించి వచ్చేసి మళ్ళీ సినిమా వదిలే సమయానికి వెళ్లి తీసుకొచ్చేస్తే పనయిపోతుంది.

ఎటొచ్చీ ఆ ముగ్గురు బామ్మలకీ సినిమా చూపించటం ఓ పెద్ద పని. ఎవరూ ఒప్పుకునేవారు కాదు. ఎప్పుడూ ఆ డ్యూటీ నా నెత్తినే పడేది. వాళ్ళకీ నేనంటే పాపం చాలా ముద్దు. నేను వెంటరావాలనే పట్టుబట్టేవాళ్ళు.

వాళ్ళు మేట్నీకి వెళ్ళరు. దీపాలు పెట్టేలోగా దేవుడి దగ్గర దీపం పెట్టుకుని ఫలహారాలు చేసెయ్యాలి. అందుకుని ఎప్పుడూ మొదటాటకే వెళ్ళేవాళ్ళు. వాళ్ళని అంటిపెట్టుకునే ఉండాలి చివరిదాకా. సినిమాలో పూర్తిగా లీనమైపోయి మరీ చూసేస్తారు. టైటిల్సు అయి సినిమా మొదలుపెట్టిన దగ్గర్నుంచి వీళ్ళ వ్యాఖ్యానం మొదలు.

"ఆహా! ఈ కుఱ్ఱాడున్నాడూ? అయితే బానే ఉంటుంది" అనుకుంటారు. ఏడుపు సీన్లు వస్తే భోరుభోరున ఏడవడం, హాస్యం వస్తే పగలబడి నవ్వుతూ పక్క సీటు వాళ్ళ వీపు విమానం మోత మోగించడం సర్వసాధారణం.

"చూశావటే అక్కయ్యా! పాపం ఆ కోడల్ని ఆ అత్తగారు ఎట్లా కాల్చుకు తింటుందో" అని చెల్లెలు అంటే–

"అవునమ్మా! దొంగ పీనుగ. పచ్చటి కాపురంలో చిచ్చుపెట్టేస్తోంది. ఇంతకింత అనుభవిస్తుందిలే" అని అక్కగారి సమాధానం.

"ఆఁ నా మొహం...ఏదో మన కడుపుమంటకి మనం అనుకోడమేగానీ ఎవరనుభవిస్తారు? ఆ మాటకొస్తే మా ఆడపడుచు నన్ను సామాన్యంగా ఏడిపించిందా!

ఆవిడకి వత్తాసు మా అత్తగారు. వాళ్ళకేమైంది...శుభ్రంగా గుండ్రాళ్ళలాగా ఉన్నారు. నేను అనుభవిస్తున్నాను" అని ముక్కు చీదుకుంటుంది చెల్లెలు.

ఇక దాంతో 'మా అత్తగారిట్లా, మా తోటికోడలు అట్లా' అని గతంలో జరిగినవన్నీ ఏకరువు పెట్టడం.

చుట్టుపక్కల వాళ్ళు "అబ్బ! ఆపండి తల్లుల్లారా...మీ సొద వినడానికి వచ్చామా? సినిమా చూడ్డానికి వచ్చామా?" అని విసుక్కోవడం.

"మేమూ సినిమాకే వచ్చాం. కాకపోతే కష్టం సుఖం మాట్లాడుకున్నాం. అదీ అపరాధమేనా?" అని వీళ్ళ గొడవ.

అపుడు కల్పించుకుని వ్యవహారం సర్దుబాటు చెయ్యాలి.

ఒకసారి ఆ ముగ్గుర్నీ నాజ్ సినిమా హాల్లో 'శ్రీకృష్ణ తులాభారం' సినిమాకి తీసుకెళ్ళాను. కృష్ణుడు కనిపించగానే 'వసుదేవ సుతం దేవం కంసచానూర మర్దనం' అని శ్లోకాలు మొదలుపెడితే కసిరి మాన్పించాను.

"మహా పతివ్రత సాక్షాత్తూ ఆదిలక్ష్మి ఆ రుక్మిణీదేవికి ఎన్ని అవమానాలో."

"సత్యభామాదేవీ! నీకింత గీర్వాణం పనికిరాదు సుమీ" అనడం...అవతల వాళ్ళు-'ఇష్షో ఇష్షో' అనడం.

ఎలాగైతేనేం సినిమా అయిపోయింది. బయటికి వచ్చాం. ఇల్లు దూరం. నడవలేరు. నలుగురం ఉన్నాం. న్యాయంగా రెండు రిక్షాలు మాట్లాడుకోవాలి. అలా చెయ్యాలంటే ఒకరితో నేను తోడున్నా, రెండో రిక్షాలో వాళ్ళిద్దరే. అందుకు చచ్చినా ఒప్పుకోరు. వాళ్ళనెవరెత్తుకుపోతారో అని భయం.

అప్పటికీ ఎన్నోసార్లు చెప్పాను. "బామ్మలూ మీ దగ్గరేముంది... మల్లు పంచెలూ తెల్ల రవికెలూ. నన్ను చూడబోతే ఉన్న సొమ్ములన్నీ ముందు జాగ్రత్తగా ఒలిచేసుకునే పంపింది మా అమ్మ. ఇక మనకేం భయం" అని. వింటేనా. 'నీకు తెలియదులే అమ్మడూ... పట్నంలో అంతటా మోసాలే' అంటారు. కాబట్టి చచ్చినట్లు అందరం ఒకే రిక్షాలో ఎక్కాలి. రిక్షా బేరం మొదలుపెట్టాను.

నలుగురం అంటే -'ముప్పావలా' అడిగాడు 'ఏం కాదు అర్ధరూపాయి ఇస్తా'నన్నాను. నలుగురైదుగురు 'రాం-పొమ్మన్నారు' ఒకడు ఒప్పుకున్నాడు.

'నలుగుర్ని బ్రిడ్జి మీదనించి ఈడ్చుకెళ్ళాలి కదమ్మా. అరవై పైసలివ్వండి" అన్నాడు. 'సరే పద' అన్నాను. 'ఎక్కండి బామ్మలూ' అంటే వెనక్కి తగ్గారు.

"ఓయమ్మ వద్దే తల్లీ... వీడెవడో ఈడ్చుకెళ్ళాలి అంటున్నాడు. ఎక్కడికి ఈడ్చుకుపోతాడో ఏం పాడో. రాత్రి పొద్దుపోయింది. జనసంచారం తగ్గిపోతోంది" అని గోలెట్టేశారు.

"అది కాదు బామ్మలూ. బ్రిడ్జి మీదికి ఎక్కేటపుడు కిందికి దిగి ఈడ్చుకెళ్ళాలి కదా! ఆ మాటే చెప్తున్నాడు" అని ఎంత నచ్చచెప్పినా– వింటేనా?

'ఆ రిక్షానే కాదు. ఇంకే రిక్షా ఎక్కం' అన్నారు. 'నడుచుకుపోదాం' అన్నారు. "ఏం చేస్తాను? సరే పదండి" అన్నా. నేనూ, నా జడ పుచ్చుకుని బామ్మా, ఆవిడ వెనక ఇంకో బామ్మా, చివర ఇంకో బామ్మా, రైలు బండిలా నడుచుకుంటూ వస్తుంటే అందరూ చూసి ఒకటే నవ్వుకోడం. చివరికెలా అయితేనేం గమ్యం చేరాం. ఇంట్లో జనం అంతా బయటే ఉన్నారు– మేము ఇంకా రాలేదని. మమ్మల్ని చూడగానే– 'అదేవిటీ నడుచుకొచ్చేరేం?' అని కంగారుపడిపోయారు.

చెప్పాను. 'పోనీ ఆ నడిచేది ఏదో పక్కపక్కనైనా నడిచే రావచ్చుగా' అంది పెద్దత్తయ్య.

"ఏమోనమ్మా! చీకట్లో పిల్ల కనుమరుగైపోతే ఏం చేస్తాం చెప్పు. అందుకే ఇలా వచ్చేశాం" అన్నారు బామ్మలు ముక్తకంఠంతో.

* * *